

406 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు 4

కిలకిల.. కళకళ







విదేశీ పక్షుల కేరాఫ్ కోరంగి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎన్నెన్నో అందాలు.. ఒకటా రెండా ఏకంగా 160 జాతులు.. 39,725 విదేశీ పక్షులు.. రష్యా, అమెరికా, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, కెనడా, సైబీరియా తదితర దేశాల నుంచి వలస వచ్చాయి. ప్రధానంగా కాకినాడ జిల్లా కోరంగిలో సందడి చేస్తున్నాయి. ప్రస్తుతం శీతాకాలం నేపథ్యంలో ఆయా దేశాల్లో తీవ్ర మంచు కురుస్తోంది. ఈనేపథ్యంలో ఆహారం కోసం విదేశీ పక్షులన్నీ 5 వేల కిలోమీటర్లకుపైగా ఎగురుకుంటూ వలస వచ్చాయి. మార్చి రెండోవారం వరకు ఇక్కడే ఉండి సంతానోత్పత్తి కోసం తిరిగి ఇవన్నీ ఆయా దేశాలకు వెళ్లనున్నాయి.

మంచుకురిసే వేళ రాక..

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న మడ అడవుల్లో పక్షులకు పెద్దఎత్తున ఆహారం దొరుకుతుంది. మడ అడవుల్లో చిత్తడి వాతావరణం ఉండడంతో చేపల వేట పక్షులకు సులువుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విదేశీ పక్షులు ఏటా శీతాకాలంలో కోరంగి అభయారణ్యానికి వలస వస్తాయి. యూరోపియన్ యూనియన్ దేశాల్లో ఏటా ఈ సమయంలో తీవ్రమైన చలికాలం ఉంటుంది. మంచు మొత్తం భూమిని కప్పేస్తోంది. దీంతో పక్షులకు ఆహారం దొరకదు. ఆహారం కోసం ఆయా దేశాల నుంచి విదేశీ పక్షులు 4 వేల నుంచి 5,500 కిలోమీటర్ల వరకు సుదీర్ఘ ప్రయాణం చేసుకుంటూ కోరంగికి, ఇతర ప్రాంతాలకు చేరుకుని మార్చి రెండోవారం వరకు ఉంటాయి.

160 జాతులు రాక..

ఎన్ని దేశాల నుంచి ఈ పక్షులు వలస వచ్చాయనేదానిపై అటవీశాఖ ఈనెల 4, 5వ తేదీల్లో గణన చేపట్టింది. ఈమేరకు ముంబై, కోల్‌కతా, డిల్లీ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి 60 మంది పక్షుల గణన నిపుణులను రప్పించింది. వీరిని ఐదుగురు చొప్పున పన్నెండు బృందాలుగా విడదీసి పక్షుల సర్వే చేయించింది. వీరంతా కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలోని కోరంగి అభయారణ్యంలో పర్యటించి 15 ప్రాంతాల్లో సర్వే చేశారు. సర్వే ప్రకారం ఈ ఏడాది ఎనిమిది దేశాల నుంచి మొత్తం 160 జాతులకు చెందిన 39,725 పక్షులు వచ్చినట్టు గుర్తించారు.

- విదేశీ పక్షుల గణన పూర్తి
- 160 జాతులు..39,725 పక్షులు
- ఎనిమిది దేశాల నుంచి రాక
- కాకినాడ, కోనసీమ జిల్లాల్లో సర్వే
- 15 ప్రాంతాల్లో 12 బృందాలు సెర్చ్
- లెస్సర్ శాండ్ ప్లోవర్ పక్షులే ఎక్కువ
- 5 వేల కి.మీ నుంచి ఇక్కడకు
- ఆహారం కోసమే కోరంగికి రాక
- మార్చి వరకు ఇక్కడే సంచారం

ఇందులో పది శాతం దేశంలో చంబల్‌తోపాటు కొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పక్షులను మినహాయించగా 90 శాతానికిపైగా విదేశీ పక్షులుగా నిర్ధారించారు. అత్యధికంగా సైబీరియా దేశానికి చెందిన లెస్సర్ శాండ్ ప్లోవర్ జాతి పక్షులు ఐదు వేలకుపైగా వచ్చినట్టు తేలింది. చిత్తడి నేలలు, నీటిలో నడుస్తూ ఆహారం తీసుకునే 56 రకాల జాతులకు చెందిన వేడర్ పక్షులు నవంబర్ నుంచి వచ్చి ఇక్కడే ఉన్నాయని తేల్చారు. రష్యా, ఆస్ట్రేలియా, చైనా, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాల్లో అరుదుగా కనిపించే రెడ్ నాట్, గ్రేటర్ ఫ్లెమింగో, బ్రాడ్‌బిల్డ్ శాండ్‌పైపర్ తదితర జాతి పక్షులు వందల్లో తాళ్లరేవు, భైరవపాలెం, ఐ.పోలవరం పరిసరాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గుర్తించారు. అంతరించే ముప్పు ఉన్న గ్రేట్ నాట్, ఇండియన్ స్కిమ్మర్ పక్షులు సైతం వేలల్లో మడ అడవుల్లో ఉన్నట్టు నిపుణులు తేల్చారు. ప్రధానంగా ఆయా పక్షుల మెడ, మెడపై ఉన్న రంగు ఆధారంగా ఏయే జాతి పక్షులు, ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పేస్తారు. పక్షుల ముక్కు, రూపం, సైజు, వేటాడే విధానం ఆధారంగా గుర్తిస్తారు.

ఏ సంవత్సరంలో ఎన్ని..

గతేడాది జనవరిలో నిర్వహించిన సర్వే ప్రకారం కోరంగికి 108 రకాల జాతులకు చెందిన 41,131 పక్షులు వచ్చినట్టు లెక్క తేల్చారు. కానీ ఈ ఏడాది పక్షులు కొంచెం తగ్గినా జాతుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారులు వివరించారు. అటు 2017లో 43,718, 2020లో 26,734, 2021లో 34,207, 2022లో 46,546 విదేశీ, స్వదేశీ పక్షులు కోరంగికి వచ్చాయి. ప్రస్తుతం వలస వచ్చిన విదేశీ పక్షులు కోరంగి అభయారణ్యం పరిసరాల్లోని కోటిపల్లి, గోదావరి, కాట్రేనికోన, ఎస్.యానాం, కుంబాభిషేకం, పల్లం, హోప్‌ఐలాండ్ ఇలా 15 ప్రాంతాల్లో భారీగా సంచరిస్తున్నట్టు గుర్తించారు. తాజా సర్వే పూర్తయిన నేపథ్యంలో వలస పక్షుల వివరాలను నివేదిక రూపంలో బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్)కు అధికారులు పంపనున్నారు.



వలసపక్షుల కేంద్రం పుణ్యక్షేత్రం

దివాన్‌చెరువు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వలస పక్షుల విడిది కేంద్రం పుణ్యక్షేత్రం. జూన్ నెల వచ్చిందంటే సౌదీ అరేబియా నుంచి వచ్చే ఈ పక్షులు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం పుణ్యక్షేత్రం చేరుకుని సందడి చేస్తాయి. ఇక్కడే సంతానోత్పత్తి చేసుకుని పిల్లలతో నవంబరు నెలలో తిరిగి వెళ్లిపోతాయి. విదేశీ అతిథులను స్థానికులు సొంతబిడ్డల్లా ఆదరిస్తారు. 70 ఏళ్లగా వలసొస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు.





కలెక్టరేట్‌లో జరిగిన వీసీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ : జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కోసం ఖచ్చితమైన సమాచారంతో నివేదికలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ క్లస్టర్ హెడ్‌మాస్టర్లు, పర్యవేక్షక అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ప్రత్యేక అధికార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎండీవోలు, ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విద్యను మరింత నాణ్యతగా, సౌలభ్యవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం ఈ విధానం చేపట్టిందన్నారు. దీనికి క్లస్టర్ల వారీగా ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలను వాస్తవంగా హాజరవుతున్న విద్యార్థుల వివరాలను ఎంఈవోలు, క్లస్టర్ హెడ్ మాస్టర్లు క్రోడీకరించాలని ఆదేశించారు. మున్సిపాల్టీల్లో కమిషనర్లు, మండలాల్లో ఎండీవోలు ఈ ప్రక్రియ పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్లస్టర్ల నుంచి సమర్పించిన సమాచారాన్ని రాండమ్‌గా తనిఖీ చేయాలన్నారు. శనివారం మరో పర్యాయం దీనిపై సమీక్షించి విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ భావన, డీఈవో రమేష్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణిలు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ భద్రతా ప్రమాణాలను పరిశీలించిన అధికారులు

విజయవాడ నుంచి విచ్చేసిన ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ మెహర్‌బాబు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ భద్రతా ప్రమాణాలను బుధవారం అధికారుల బృందం పరిశీలించింది. ప్రధానంగా విజయవాడ నుంచి విచ్చేసిన ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ మెహర్‌బాబు కాకినాడ కలెక్టరేట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టరేట్ గోడలు ఎత్తు, అలాగే ఆందోళనకారులు ప్రవేశించేందుకు వీలుగా ఏమైనా మార్గాలు ఉన్నాయా, కలెక్టరేట్‌కు వచ్చే వీఐపీలు, వీవీఐపీల భద్రతకు ఏమైనా ముప్పు పొంచి ఉందా అనే అంశాలను తనిఖీ చేశారు. సెక్యూరిటీ ఆడిట్ తనిఖీలలో భాగంగా ఈ తనిఖీ నిర్వహించారు. కాకినాడ డీఆర్వో వెంకట్రావు ఆయనకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రధానంగా రాత్రి సమయంలో కలెక్టరేట్‌కు ఉన్న రెండువైపుల గేట్ల వద్ద సెక్యూరిటీ ఎలా ఉంటుంది అనే అంశాన్ని ఏఎస్పీ ఆరా తీశారు. అలాగే కలెక్టరేట్‌లో ఎన్ని సీసీ కెమేరాలు ఉన్నాయి, ఇంకా ఎన్ని కెమేరాలు ఏర్పాటు చేయాలి అనే విషయాలపై సూచనలు చేశారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిశారు. ఈ సెక్యూరిటీ ఆడిట్‌లో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీహరి, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, ఇంటిలిజెన్సు విభాగం, ఫైర్‌అండ్ సేఫ్టీ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఐఎస్‌డబ్ల్యూ వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటనలు



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

కాకినాడ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో చేపట్టే పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బుధవారం దుమ్ములపేట, పర్లోవపేట, ఏటిమొగ తదితర ప్రాంతాలను పరిశీలించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దుమ్ములపేటలో పేద ప్రజలకు అందించిన పట్టాల భూములను, కాకినాడ నుంచి ఏటిమొగ మీదుగా గురజనాపల్లి వరకు నిర్మించే మూడో బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించారు. అదే విధంగా జగన్నాథపురం ఎంఎస్ఎన్ చార్టీస్ ఆవరణలో ప్రతిపాదించిన ఎంఎస్ఎన్ స్టేడియం ప్రదేశాన్ని, అసంపూర్తిగా నిలిచిపోయిన స్మార్ట్‌సిటీ నిధుల పనులను పరిశీలించారు. సంజయ్ నగర్ డంపింగ్ యార్డు వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డును సందర్శించారు. జగన్నాథపురంలో నిలిచిపోయిన స్మార్ట్‌సిటీ నిధుల పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు, అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, అధికారులు పాల్గొన్నారు.



కాండ్రేగులలోని సోమన్న చెరువు ఉపాధి పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

జగ్గంపేట, కిర్లంపూడిల్లో అభివృద్ధి పనుల పరిశీలన

జగ్గంపేట రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సుడిగాలి పర్యటన చేశారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. మామిడాడలో దాడి వెంకటేశ్వర్లు నిర్మించుకున్న గోకులం షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ షెడ్డు నిర్మాణంలో ఏమైనా సమస్యలున్నాయా, సిబ్బంది పనితీరు ఎలా ఉందని రైతుని అడిగి తెలుసుకున్నారు. అలాగే కాండ్రేగుల గ్రామంలోని సోమన్న చెరువుని పరిశీలించారు. సోమన్న చెరువు రూ.10.50 లక్షలతో ఉపాధి నిధుల ద్వారా అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్‌కు సిబ్బంది వివరించారు. కలెక్టర్ చెరువు పూడికతీత వల్ల ఉపయోగం ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. ఉపాధి సిబ్బంది చెరువును లోతు చేయడం వల్ల నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని, అది సాగునీరుగా ఉపయోగపడుతుందని తెలిపారు. మట్టిని తీసి గట్టున వేయడం ద్వారా గట్టుపై కొబ్బరిచెట్లు పెంచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం జగ్గంపేట పశువుల ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఆసుపత్రికి కాంపౌండ్ వాల్ శిథిలావస్థకు చేరుకోవడంపై ఆరా తీశారు. నిర్వహణ లోపాలపై కలెక్టర్ అసహనం వ్యక్తంచేసినట్టు తెలుస్తోంది.

కిర్లంపూడిలోనూ...

కిర్లంపూడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం కిర్లంపూడి మండలంలో పర్యటించారు. ముందుగా కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. డాక్టర్ రాంబాబు నాయక్‌ను ఆసుపత్రిలోని వసతులపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు వెయిటింగ్ హాల్ కావాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాలకు ముగ్గురు ఫీల్డు అసిస్టెంట్లు కావాలని జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలతరాంబాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. బూరుగుపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.



ఒకే యాప్.. సేవలెన్నో!

- మీ టీవీ ఏసీ పనిచేయడం లేదా..
- ఒక క్లిక్‌తో ఇంటికే వచ్చి రిపేర్లు
- బ్యూటీషియన్ సేవలు మన ముంగిటకే
- హోమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా అందుబాటులోకి టెక్నీషియన్లు, ఇతర నిపుణులు
- పట్టణాలు, నగరాల్లో మార్చి నుంచి అందుబాటులోకి 30 రకాల సేవలు
- ప్రభుత్వం చొరవతో ప్రజల ఇబ్బందులకు ఇక చెక్



పిఠాపురంలో మెప్మా నిర్వహించిన సమావేశానికి హాజరైన సర్వీసు ప్రొవైడర్లు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

మీ ఇంటిలో టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్, ఇతర గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేయడం లేదా.. ఇంటి వద్దే అలంకరణ చేయించుకోవాలనుకుంటున్నారా.. గృహాలు మారే సమయంలో వస్తువులను అక్కడకు మార్చు చేయాలా. ఇలా ఏ రకమైన సేవలు కావాల్సినా ఒకే క్లిక్‌తో టెక్నీషియన్లు, ఇతర నిపుణులు మీ ముంగిటకే వస్తారు. వీరంతా ప్రభుత్వం గుర్తింపు పొందినవారు కావడంతో ఎటువంటి భయం, ఆందోళన లేకుండా వారి నుంచి సేవలు పొందవచ్చు. పట్టణాలు, నగరాల్లో ఈ సేవలు మార్చి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే మెప్మా ద్వారా సర్వీసు ప్రొవైడర్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. పట్టణాలు, నగరాల్లో ప్రజల ముంగిటకే పలు రకాల సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి ఇబ్బందులు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకూ గృహాల్లో ఉన్న టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, మిక్సీలు, కంప్యూటర్లు, ఇతర గృహోపకరణాలు మరమ్మతులకు గురైతే వాటిని టెక్నీషియన్లు లేదా షాపుల వద్దకు ప్రజలే వాటిని తీసుకువెళ్లి రిపేరు చేయించుకోవడం లేదా వారు నివాసముండే పట్టణంలో లేదా నగరంలో ఎక్కడైనా ఇటువంటి సేవలు అందించే వారు ఉన్నారా అని ఆన్‌లైన్‌లో చెక్ చేసి వారిని ఇంటికి పిలవడం జరిగేది. ఇప్పుడు అటువంటి వాటికి ప్రభుత్వమే రంగంలోకి దిగింది. మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమబెంగాల్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలైన విధానాన్ని ఇక్కడ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగానూ మెప్మా ద్వారా హోమ్ ట్రయాంగిల్ యాప్‌తో ఒప్పందం చేసుకుంది. హోమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా తొలుత పట్టణాలు, నగరాల్లో 30 రకాల సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, మిక్సీలు, గ్రైండర్లు, మైక్రోఓవెన్లు సహా అన్ని రకాల గృహోపకరణాలు, కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, హీటర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్లు, ఇతర సర్వీసులు, ఫేషియల్, మేకప్ సహా అన్ని రకాల సేవలు అందించేందుకు బ్యూటీషియన్లు, గృహాల్లో బాత్‌రూమ్‌లు, వాటర్ సప్లై తదితరాల నిర్వహణ, మరమ్మతులు, ఇంటి శుభ్రత, పెస్ట్ కంట్రోల్, ఇళ్లకు రంగులు వేసేందుకు పెయింటర్లు, ఇంటీరియర్ డిజైనింగ్, ఇళ్లు మారే సమయంలో సామాన్లను ప్యాక్ చేసి రవాణా చేసేందుకు ఇలా పలు రకాల సేవలు ఈ యాప్‌లో ఉంటాయి. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని మనకు అవసరమైన సేవను ఎంపిక చేసి మన చిరునామా ఎంటర్ చేస్తే తక్కువ వ్యవధిలోనే అందుకు సంబంధించిన వారు మన ఇంటికి వచ్చి సేవలు అందిస్తారు.

నిపుణుల ఎంపిక ఎలా..

ట్రయాంగిల్ యాప్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మెప్మాకే టెక్నీషియన్లు, ఇతర నిపుణుల ఎంపిక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు చెందిన వారినే ఎంపిక చేసేందుకు వీలుగా కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, తుని, ఏలేశ్వరం, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లు, కార్పెంటర్లు, బ్యూటీషియన్లు(పురుషులు, మహిళలు), గృహోపకరణాలు రిపేర్లు చేసే టెక్నీషియన్లు, ఇంటీరియర్ డిజైనర్లు, పెయింటర్లు తదితరుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సుమారు వేయి మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతల ఆధారంగా ఎంపిక చేసి నెలరోజులపాటు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తారు. సాంకేతిక అంశాలు, యాప్ వినియోగం, ఎవరయినా సేవలు పొందేందుకు రిజిస్టర్ చేసుకుంటే ఎలా స్పందించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. వీరి శిక్షణ అనంతరం రెండవ విడతలో మరికొందరికి అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటారు. సర్వీసులు అందించేందుకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సంబంధిత పోలీసుస్టేషన్లకు పంపి వారిపై ఆరా తీస్తారు. పోలీసు కేసులు నమోదై ఉన్న వారిని తప్పించి మిగిలిన వారినే ఎంపిక చేస్తారు. అలా ఎంపిక చేసి శిక్షణ పొందిన వారినే యాప్‌లో నమోదు చేస్తారు.

వీరికి ఆదాయం.. వారికి వెసులుబాటు

ట్రయాంగిల్ యాప్ ద్వారా ఇంటి వద్దే సేవలు పొందే వెసులుబాటు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఇది ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాలు, ఇతర పనుల్లో బిజీగా ఉన్న వారికి ఉపయోగకరంగా ఉంటుంది. ఒక క్లిక్‌తోనే సేవలు అందించేందుకు టెక్నీషియన్లు లేదా ఆయా నిపుణులు రావడం వల్ల సమయం ఆదా కావడంతో తక్షణం సంబంధిత పరికరాలు అందుబాటులోకి వస్తాయి. అదేవిధంగా సేవలు అందించే సర్వీసు ప్రొవైడర్లకు ఒక్కొక్కరికి నెలకు కనీసం రూ.20వేల నుంచి 25 వేల ఆదాయం వస్తుందని మెప్మా అధికారుల అంచనా. సర్వీసు ప్రొవైడర్లు యాప్ నిర్వాహకులకు నెలకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. అయితే మొదటి మూడు నెలలు ఈ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చారు. తొలుత పట్టణాలు, నగరాల్లో అందుబాటులోకి రానున్న ఈ సేవలను మలిదశలో మండల కేంద్రాలకు, తదనంతరం ముఖ్యమైన గ్రామాలకు విస్తరిస్తారు.

రేపు మినీ జాబ్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ ఆధ్వర్యంలో ఈనెల 24న కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ కాలేజీలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ బుధవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, ఎలక్ట్రికల్, ఫిట్టర్ లేదా ఏ డిగ్రీ పూర్తి చేసినా 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సున్న వారు అర్హులు అన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 901073799, 8500885866 నెంబర్లను సంప్రదించాలన్నారు.


గుమస్తా ఆస్తుల అటాచ్‌మెంట్

కాకినాడ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై సత్యనారాయణ 2023 మే 8వ తేదీన లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ కేసులో అతని ఆస్తులను అటాచ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ఆదాయానికి మించిన ఆస్తులు రూ.2.96 కోట్లు గుర్తించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఆస్తులు సత్యనారాయణ భార్య, ఇద్దరు కుమార్తెలతో పాటు తమ్ముడి భార్య, కుమార్తె పేరున ఉన్నట్టు గుర్తించారు. కేసు తుది విచారణ పూర్తి అయ్యేంత వరకు ఈ ఆస్తుల అటాచ్‌మెంట్ అమల్లో ఉంటుందని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మాని ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ వర్గీకరణ వల్ల జాతీయ ఐక్యతకు ముప్పు
మన దేశంలో రెండు ముక్కలు : కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ 4



కాతేరు.. పేరు వినగానే శిలలపై శిల్పాలు చెక్కినారూ.. పాట గుర్తురాకమానదు. నిజమే, మనవాళ్లు చెక్కిన అందమైన విగ్రహాలు దేశం నలుమూలలకూ వెళ్లడమేకాదు, విదేశాలకు సైతం తరలి వెళుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని కాతేరు గ్రామంలోకి వెళ్లగానే శిల్పాల తయారీ అడుగడుగునా కనిపిస్తుంటుంది. ఎంతో నైపుణ్యం కలిగిన శిల్పులు ఇక్కడ రాతి, పాలరాతి విగ్రహాలకు జీవం పోస్తారు. ఎక్కువగా దేవుళ్లు, దేవతల విగ్రహాలను ఇక్కడ తీర్చిదిద్దుతారు. వందల ఏళ్లుగా ఇది విగ్రహాల తయారీ కేంద్రంగా మారింది. ఎన్నో తరాల నుంచి ఆ విగ్రహాల తయారీల నిమగ్నమై ఉండి ఆ కళను కాపాడుకుంటూ వస్తున్నారు.


తథాగతుడు

దేవుడి రూపశిల్పులు!

- దేవతా విగ్రహాలకు కేరాఫ్ కాతేరు
- వీరి చేతులతోనే శిలలకు విగ్రహరూపం
- విజయనగర సామ్రాజ్య కాలం నుంచి కొనసాగుతున్న శిల్పాల తయారీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోకి కాతేరులో రాతి, పాలరాతి విగ్రహాల తయారీ తరతరాలుగా నడుస్తోంది. శిలలను చెక్కి విగ్రహాలుగా తీర్చిదిద్దడమే ఇక్కడ చాలామందికి ప్రధాన వృత్తి. దేశంతోపాటు విదేశాల్లో సైతం ఆంధ్రప్రదేశ్‌లోని కాతేరు రాతి శిల్పాలకు ప్రత్యేక డిమాండ్ ఉందంటే ఇక్కడి శిల్పుల కళానైపుణ్యం ఎంత గొప్పదో అర్థమౌతుంది. కాతేరు గ్రామంలో అద్భుతమైన కళాఖండాలను రాతిపై ఆవిష్కరించే శిల్పులు ఎందరో ఉన్నారు. కళలను పెంచి పోషించే విజయనగర సామ్రాజ్య హయాంలో శిల్పకళాకారులకు ప్రత్యేకమైన గౌరవం గుర్తింపు ఉండేది. ఆ క్రమంలో సింహాచలం ఆలయ నిర్మాణానికి కొంతమంది శిల్పులను విజయనగరం నుంచి తీసుకువెళ్లారు. ఆ ఆలయం నిర్మాణం పూర్తయ్యాక రాజావారి ఆదేశాలతో కొంతమంది శిల్పులను అప్పట్లో రాజమహేంద్రవరం, విజయవాడ, భద్రాచలం, కర్నూలు వంటి ప్రాంతాల రాజుల ఆహ్వానాల మేరకు ఆలయాల నిర్మాణాలకు శిల్పులు తరలివెళ్లారు. అలా వచ్చిన వారిలో ఒకరు పిల్లేడి నరసింహాచార్యులు.. విజయనగరం నుంచి వచ్చి రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరుకు చేరుకుని ఇక్కడ తన శిల్పకళను విస్తరించారు. వారి వారసులు కోమల ప్రసాద్ ఆచార్యులు, హరి నాగ భూషణాచార్యులు, సాయిరామ నాగశ్రీనివాసాచార్యులు, హైగ్రీవనాగాచార్యులు ప్రస్తుతం కాతేరులో రాతి విగ్రహాలను తయారుచేసి దేశ, విదేశాలకు పంపిస్తున్నారు. కాతేరులో రూ.వంద నుంచి రూ. పది లక్షల విలువ చేసే రాతి, పాలరాతి విగ్రహాలు తయారవుతున్నాయి. కాతేరు నుంచి అమెరికా, ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాలకు సైతం విగ్రహాలను ఎగుమతిచేస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలు దేశంలో తిరుపతి ఇస్కాన్, రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని జ్ఞానసరస్వతి దేవాలయంతోపాటు శ్రీలంక వంటి దేశాల్లో నిత్యం పూజలు అందుకుంటున్నాయి.

రాతి విగ్రహాలకు డిమాండ్ తగ్గదు




రాతి విగ్రహాలను తయారు చేసే శిల్పులు నానాటికి తగ్గిపోతున్నారు. మా తర్వాత జనరేషన్‌లో రాతి విగ్రహాల తయారీ శిల్పులు లేరనే బాధ ఉంది. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా దేవాలయంలో పూజలు అందుకునేది మాత్రం రాతి విగ్రహమే. మరే విగ్రహాన్ని దేవాలయం గర్భగుడిలో ప్రతిష్ఠించరు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలకు ఇచ్చిన ప్రాధాన్యత రాతి విగ్రహాల తయారీకి ప్రభుత్వం ఇవ్వడం లేదు. ప్రభుత్వం సహకరించి ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుచేస్తే మేమే ఉచితంగా శిల్పకళను బోధిస్తాం.


- కొమల ప్రసాద్ ఆచార్యులు,
భారత శిల్పనిలయం నిర్వాహకుడు, కాతేరు


విగ్రహ తయారీ

అమెరికాకు శ్రీకృష్ణుడు.. అక్షరాలా పది లక్షలు..

బన్సీహార్పూర్ రాయితో తయారు చేసిన శ్రీకృష్ణుడు ఫౌంటైన్ అమెరికా దేశంలోని వర్జీనియాలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని కాతేరులో కోమల ప్రసాద్ ఆచార్యులు తయారుచేశారు. దీని విలువ రూ.10 లక్షలు. ఇలా ఎంతో ఖరీదైన విగ్రహాలు కూడా ఇక్కడ తయారుచేస్తుండడం వీరి ప్రత్యేకత


బాబా విగ్రహం


పాలరాతి విగ్రహాలు



ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలకు
భారతదేశం ప్రత్యేకమైనది

ఆశ్రమంలో విదేశీ యాత్రికుల బృందం



30 ఏళ్లుగా వస్తున్నా..



నేను 30 ఏళ్లుగా ఫ్రాన్స్ నుంచి ఇక్కడికి వస్తున్నాను. పౌమి అనే మహిళ రాసిన పుస్తకంతో బాలయోగీశ్వరుల చరిత్రను తెలుసుకున్నాను. ఇక్కడ ఆధ్యాత్మికంగా ఒక శక్తి ఉంది. ఏ సమస్య వచ్చినా ఇక్కడకు వచ్చి వెళ్తే ఆ సమస్య పరిష్కారమవుతుంది. ఇక్కడవారి కన్నా బాలయోగీశ్వరుల విశిష్టత మాకే ఎక్కువగా తెలిసింది.

పాట్రిక్ డకే, ఆధ్యాత్మిక గురువు, ఫ్రాన్స్

- ఫ్రాన్స్ ఆధ్యాత్మిక గురువు ప్యాట్రిక్ డకే
- ముమ్మిడివరం బాలయోగీశ్వరుల ఆశ్రమాన్ని సందర్శించిన యూరోపియన్ బృందం
- ఆశ్రమంలో ప్రార్థనలు చేసిన వివిధ దేశస్థులు


బాలయోగీశ్వరుల ఆశ్రమంలో యాత్రికుల బృందం



ముమ్మిడివరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, సాంస్కృతిక సంప్రదాయాలకు భారతదేశంలో ఒక ప్రత్యేకత ఉందని యూరోపియన్ యాత్రికుల బృందం కొనియాడింది. ఫ్రాన్స్‌కు చెందిన ఆధ్యాత్మిక గురువు ప్యాట్రిక్ డకే ఆధ్వర్యంలో ఫ్రాన్స్, బెల్జియం, స్విట్జర్లాండ్, లెబనాన్‌కు చెందిన 33 మంది విదేశీ యాత్రికుల బృందం బుధవారం ముమ్మిడివరంలోని శ్రీపెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల తపో ఆశ్రమ ప్రాంతాన్ని సందర్శించింది. పెదబాలయోగీశ్వరులు, చిన బాలయోగీశ్వరుల సమాధులు, వారి జనన మందిరాన్ని, తపస్సు ప్రారంభించిన ప్రాంతాన్ని సందర్శించి అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. తమిళనాడులోని మహాబలిపురాన్ని సందర్శించిన వారు అక్కడి నుంచి రాజమహేంద్రవరం వచ్చి ముమ్మిడివరం బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని సందర్శించారు. ఇక్కడి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, తిరువణ్ణామలైతో పలు ఆధ్యాత్మిక ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన పౌమి అనే మహిళ బాలయోగీశ్వరుల తపో మహిమ, విశిష్టత, చరిత్రలను ఫ్రాన్స్ భాషలో పుస్తకాలు రాసి వీడియోల ద్వారా అక్కడి ప్రజలు, భక్తులకు ప్రచారం చేసేవారు. వీటికి ఆకర్షితులైన యూరోపియన్ యాత్రికులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని సందర్శిస్తుంటారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్యాట్రిక్ డకే 1987 నుంచి ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల తపో ఆశ్రమానికి వస్తూ పలువురు విదేశీ యాత్రికులు, భక్తులకు ఆశ్రమ విశిష్టత, ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. విదేశీ యాత్రికుల బృందానికి బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు కటికదల చంద్రరావు, కటికదల చినసుబ్బారావు, కటికదల బాలవివేకానంద, కటికదల బాలకృష్ణ, కటికదల బాలసత్యనారాయణ, కటికదల గంగాధర్, కటికదల స్వరూప్ వసతి, భోజనం వంటి సౌకర్యాలు కల్పించి ఆతిథ్యాన్నిచ్చారు. యాత్రికుల బృందానికి పెదబాలయోగీశ్వరులు, చిన్నబాలయోగీశ్వరుల ఆధ్యాత్మిక చరిత్రలను వివరించి వారి చరిత్ర పుస్తకాలను అందించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు తాడి నరసింహారావు, దాట్ల బాబు, యాళ్ల ఉదయ్, భక్తులు పెన్మెత్స జగ్గప్పరాజు, సీహెచ్ వెంకటరమణ, చిక్కం శ్రీనివాసరావు, దేశంశెట్టి గోపీలతో పాటు పలువురు యాత్రికులను కలిసి బాలయోగీశ్వరుల చరిత్రను వివరించారు.

మనస్సును నిశ్చలంగా ఉంచుకోవాలి

- మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ
- పిఠాపురంలో అనఘాష్టమి వ్రతాలు


పిఠాపురంలో దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

పిఠాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మనస్సును నియంత్రణలో నిశ్చలంగా ఉంచుకోవడం ద్వారా జీవితంలో దేనినైనా సాధించవచ్చునని, అది ఆధ్యాత్మికతత్వంతోనే సాధ్యమవుతుందని మైసూరు అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని అగ్రహారంలో కొలువయి ఉన్న అనఘా దత్త క్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు అనఘాష్టమి వ్రతాలు నిర్వహించారు. భక్తులతో స్వామీజీ స్వయంగా వ్రతాలు చేయించారు. అనఘాష్టమి వ్రతానికి ఎంతో విశిష్టత ఉందని స్వామీజీ తెలిపారు. ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా సుఖసంతోషాలు, శుభాలు కలుగుతాయని చెప్పారు. అంతకుముందు ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీతో కలిసి గణపతి సచ్చిదానంద స్వామీజీ పలే పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనఘాదేవి సమేత దత్తాత్రేయస్వామికి వారికి అభిషేకాలు అనంతరం హారతులు ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం కలశపూజ, వేదపారాయణ, గోపూజ, శ్రీచక్రార్చన, రుద్రయాగ సహిత మహాగణపతి నవగ్రహ హోమం నిర్వహించారు.రాత్రి ప్రదోషకాల పూజ, నామసంకీర్తన, కాకడహారతి జరిగాయి. గోపూజ అనంతరం స్వామీజీ గోవుకు అరటిపండు తినిపించారు. ఉత్సవాలకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు.

ఎస్సీ వర్గీకరణ వల్ల జాతీయ ఐక్యతకు ముప్పు

మన దేశం రెండు ముక్కలు : కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


విలేకర్లతో మాట్లాడుతున్న చింతా మోహన్

కాకినాడ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వల్ల భవిష్యత్తులో జాతీయ ఐక్యతకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కాకినాడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితే మన దేశం రెండు ముక్కలవుతుందన్నారు. రాబోయే ఇరవై ఏళ్లలో ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశంగా అవతరించడం ఖాయమన్నారు. ఇందుకు కారణం ఉత్తర భారతదేశంలో మాదిగలు ఎక్కువగా ఉంటే, దక్షిణ భారతదేశంలో మాలలు ఎక్కువగా ఉంటార్నారు. ఎస్సీ విభజన అంశం వల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా ఏర్పడ్డాయన్నారు దళితుల జోలికి పోబట్టే రాష్ట్రం విడిపోయిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎస్సీ వర్గీకరణపై తన అభిప్రాయం తెలపాలని డిమాండ్ చేశారు. ఒకటిగా కలిసిఉన్న మాల మాదిగలను వేరు చేయాలని ఆది నుంచి తెలుగుదేశం పార్టీ భావించిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇచ్చింది ఆర్డర్ కాదని, డిజాస్టర్ అని అన్నారు. యూపీ, తమిళనాడు, కేరళలో లేని ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎందరో త్యాగాలు, ఇందిరాగాంధీ కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం వచ్చిందని, దీనిపై కన్ను పడ్డ కార్పొరేట్‌లు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి భూములు అమ్ముకోవాలని చూశారన్నారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల సాయం ఆకలితో ఉన్న వాడికి అరటిపండు చేతికి ఇచ్చినట్లు ఉందన్నారు. ఐసీయూ నుంచి బయటపడ్డామని సీఎం చంద్రబాబు మెడికల్ భాషలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విశాఖ ఉక్కును సంపూర్ణ స్థితికి తెచ్చే బాధ్యత చంద్రబాబుదేనన్నారు. బ్యాంకుల నుంచి రూ.45 వేల కోట్లు అప్పులు తెచ్చి ఎన్పీఏ పెట్టి రుణ మాఫీ చేయించుకున్న పెద్ద మనిషికి మళ్లీ బ్యాంకుల నుంచి రూ.10 వేల కోట్లు అప్పు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం తయారవుతోందన్నారు. దేశ జనాభాలో 25 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పుల్లో ఒక శాతం కూడా ఉండటం లేదని విమర్శించారు.

కాకినాడలో 15 నుంచి సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు సన్నాహక ఏర్పాట్లపై అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ 2024-25ను కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్నారన్నారు. ఈ క్రీడలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులతో 40 టీమ్‌లు పాల్గొంటాయన్నారు. ఈ జాతీయ స్థాయి క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు స్టేడియంతోపాటు క్రీడాకారులకు అవసరమైన వసతి, భోజన, రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్టేడియంలో హాకీ టర్ఫ్ చుట్టూ గ్యాలరీలు, క్రీడాకారులకు డ్రెస్ చేంజింగ్ రూమ్‌లు బస కోసం ఏర్పాట్లుకు బేవరేజస్ కార్పొరేషన్ ద్వారా రూ.8కోట్ల నిధులు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఫిబ్రవరి 2వతేదీ నుంచి 5వతేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్ ఏర్పాట్లపై సమీక్షించారు. అలాగే ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 10వతేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో రాష్ట్రస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. డీఆర్వో వెంకట్రావు, డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ కంఠ, డీఈవో రమేష్, ఆర్టీవో శివా రెడ్డి, జిల్లా హాకీ అసోసియేషన్ డైరెక్టర్ రవిరాజ్ పాల్గొన్నారు.

నేడు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం

అనపర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతియేటా పలువురు ప్రముఖులకు అందజేసే స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు సంబంధించి పలు రంగాల్లో నిష్ణాతులైన నలుగురికి గురువారం దుప్పలపూడిలోని ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగే స్వామి వివేకానంద జయంతోత్సవాల సందర్భంగా ప్రదానం చేయనున్నట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎమ్.దుర్గా ప్రసాద్ తెలిపారు. 2025కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ పూర్వపు ఉపసభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్, ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖ సలహాదారు, బ్యారేజీల నిపుణులు నాగినేని కన్నయ్య నాయుడు స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డును ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాధా మనోహరదాస్ ప్రభూజీలకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనపర్తి సమీపంలోని దుప్పలపూడిలో గల ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ చేతుల మీదుగా అవార్డులతో పాటు జ్ఞాపిక రూ.25 వేల నగదును అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ ఉన్నతాధికారి వీవీ లక్ష్మీనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు హ్యాండ్ రైటింగ్ మారథాన్

జేఎన్టీయూకే, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలో గురువారం ఉదయం హ్యాండ్ రైటింగ్ మారథాన్ నిర్వహించనున్నట్టు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. 2000 మంది ఆదిత్య విద్యార్థులు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు కూడా పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ఎగ్జిక్యూటివ్ దిలీప్ పాత్రో, కాకినాడ జిల్లా 3వ అదనపు జడ్జి కమలాదేవి, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఆదిత్య డైరెక్టర్ శృతి రెడ్డి, సింగర్ యశస్వి, సద్గురు అకాడమీ చైర్మన్‌మహాలక్ష్మి హాజరుకానున్నారని చెప్పారు.

406 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో 406మంది పంచాయతీ సిబ్బందికి ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. 196మంది గ్రామ పంచాయతీ గ్రేడ్ 4 కార్యదర్శులకు గ్రేడ్ 3 పదోన్నతులు, 210మంది గ్రేడ్ 5 కార్యదర్శులకు గ్రేడ్ 4 పదోన్నతి పొందారు. ఈ మేరకు పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి జీవో జారీ చేశారు. వారందరికీ ఈనెల 30న జిల్లా పరిషత్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న పదోన్నతులు లభించడంతో బుధవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలుతెలిపారు.


కలెక్టర్‌ను కలిసిన కార్యదర్శులు

సమన్యాయంతో మేలు చేయడమే లక్ష్యం

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్


పెనుమర్తిలో కాకినాడ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

సర్పవరం జంక్షన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిమ్న, దళిత, మైనారిటీ సామాజిక వర్గాలకు సమన్యాయంతో మేలు చేయడమే తమ లక్ష్యమని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డు ఐఏఎస్ జీఎస్ఆర్‌కే విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కాకినాడ రూరల్ మండలం పెనుమర్తిలో కాకినాడ జిల్లా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిబరేషన్ పార్టీతో దళిత, మైనారిటీల వర్గాలకు అండగా ఉంటుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలన్నారు. బాధిత వర్గానికి చేరువగా నిలబడి వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రజలను సంఘటితం చేసి రాజ్యాధికారంలో భాగస్వామ్యం అయ్యేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ జిల్లా కార్యాలయాలు ప్రారంభిస్తున్నామని, ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విజయ్‌కుమార్ స్థాపించిన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి క్రిస్టోఫర్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పులుగు నాగేశ్వరరావు, శివకోటి రాము, బి.కృష్ణ, కల్లూరి కుమారబాబు, పెదరాజు, ఎస్.అన్నవరం, బుచ్చిరాజు, అరుణ్‌కుమార్, ఖండవల్లి లోవబాబు,ఏ.ధర్మరాజు పాల్గొన్నారు.

ముంగండలో రుగ్వేద మహాసభలు


రుగ్వేద సభలో పాల్గొన్న వేదపండితులు

పి.గన్నవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కూడా రుగ్వేదమును అభివృద్ధి చెయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది మునులు సంచరించిన ముంగండ(మునిఖండ)లో రుగ్వేద మహాసభలను ముంగండ శ్రీలక్ష్మీగణపతి మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే బుధవారం శ్రీఆశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో సంపూర్ణ రుగ్వేద సంహిత, బ్రహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్ పారాయణ, వేద విద్వత్ మహాసభలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సభలు ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మొదటిరోజు పండితులు స్థానిక శ్రీఉమా మూలేశ్వరస్వామి ఆలయం నుంచి సభాస్థలి వరకు గ్రామప్రదక్షిణ, వేదపురుష కలశస్థాపన రుగ్వేద సంహిత పారాయణ నిర్వహించారు. అనంతరం సాయంకాలం శ్రీదత్తాత్రేయ వేద విద్యా గురుకులం వ్యవస్థాపకులు, ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ గుళ్లపల్లి సీతారామచంద్ర మూర్తి ఘనపాఠి వేద విద్యార్థులకు ఆశీర్వచనమును అందించారు. తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి 70మంది రుగ్వేద పండితులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో స్వాతి నక్షత్ర పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలను వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు శిరస్సుపై కలశాలు ధరించి ఆలయ ప్రదక్షిణ అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో స్వామివారికి అభిషేకాల అనంతరం 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.47కోట్లు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

» బంగారం 19 గ్రాములు, వెండి 890 గ్రాములు, 50 విదేశీ కరెన్సీ నోట్లు

ఆత్రేయపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తులు సమర్పించిన హుండీ కానుకలు లెక్కించగా రికార్డు స్థాయి ఆదాయం లభించింది. పర్యవేక్షణాధికారులు టి.ప్రసాద్, ఎన్.ప్రసాద్‌రాజు, బి.కిరణ్ సమక్షంలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 40రోజులకుగాను ప్రధాన హుండీల ద్వారా రూ.1,20,88,369, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.22,38,144 వెరసి రూ.1,47,48,923 ఆదాయం లభించింది. బంగారం 19 గ్రాములు, వెండి 890 గ్రాములు, 50 విదేశీ కరెన్సీ నోట్లు హుండీ ద్వారా లభించినట్లు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4,22,210 లభించింది. ఈ లెక్కింపులో అర్చకులు, గ్రామస్థులు, సిబ్బంది, కెనరా బ్యాంకు, దేవస్థానం సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో విదేశీయుల సందడి



ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయించిన హంగేరీ, స్వీడన్ దేశాలకు చెందిన ఇద్దరు మహిళలు

» చింతూరు మండలం నిమ్మలగూడెంలో మందులు కొన్న విదేశీ మహిళలు

చింతూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని ఆయుర్వేద వైద్య నిలయంలో విదేశీయులు సందడి చేశారు. చింతూరు మండలం నిమ్మలగూడెంలోని జమాల్‌ఖాన్ ఆయుర్వేద నిలయానికి యూరోపియన్ దేశాలైన స్వీడన్, హంగేరీలకు చెందిన పలువురు మహిళలు బుధవారం విచ్చేశారు. తమ రుగ్మతలకు సంబంధించి ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్‌కు వివరించి మందులు తీసుకున్నారు. తాము గతంనుంచి ఇక్కడి మందులు వాడుతున్నామని, కొరియర్ ద్వారా తమ దేశానికి తెప్పించుకుంటూ ఉంటామని వారు తెలిపారు. వాటి వినియోగం ద్వారా సత్ఫలితాలు ఉన్నాయన్నారు. భారతదేశ పర్యటనకు వచ్చిన సందర్భంగా తాము నేరుగా ఇక్కడి ఆయుర్వేద నిలయం వద్దకు వచ్చామని స్పష్టం చేశారు. విదేశీయులైన మహిళలు ఆయుర్వేద మందుల దుకాణానికి రావడం, ఈ మందులు వాడుతున్నామని చెప్పడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



ఈశ్వరరావు మృతదేహం

గొల్లప్రోలురూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మెట్లపై నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన సిరసపల్లి ఈశ్వరరావు (40) మంగళవారం రాత్రి తన ఇంటి మేడపై నుంచి దిగుతూ మెట్లపై నుంచి జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



బ్రహ్మయ్య మృతదేహం

మామిడికుదురు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పీతల వేట కోసం వెళ్లి మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామానికి చెందిన పసింగు బ్రహ్మయ్య(49) మృతి చెందినట్టు నగరం ఏఎస్ఐ పి.కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మయ్య బుధవారం సాయంత్రం తన ఇంటినుంచి పాటుపోటు కాల్వవైపు చేపలవేటకు వెళ్లాడు. దాని పక్కనే ఉన్న వాడుకలో లేని చెరువులో పీతల కోసం వేటాడుతూ ప్రమాదవశాత్తూ వలలో చిక్కుకుని మరణించాడు. మృతుని కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బొలారో వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



పటవల సెంటర్‌లో గాయాలపాలైన యువకులు

తాళ్లరేవు,జనవరి 22(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం పటవల హైవేపై బుధవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని బొలారో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ వివరాలప్రకారం.. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన పాసల వెంకటేష్, ప్రసాద్ కాకినాడనుంచి అమలాపురం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు.పటవల సెంటర్‌లో వీరికి ఎదురుగా బొలారోవ్యాన్ వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు కాగా అపస్మారకస్థితికి చేరుకున్నారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోరింగ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడ్చిపెట్టిన వివాహిత మృతదేహానికి పోస్టుమార్టం



కొత్తపల్లి మండలం మూలపేటలో పూడ్చిన వివాహిత మృతదేహాన్ని తీస్తున్న దృశ్యం



పక్కనే బయటకు తీసిన బాక్స్

కొత్తపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వివాహిత మృతదేహానికి శ్మశానవాటికలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. కొత్తపల్లి మండలం మూలపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన గింజాల బాల(25) అదే గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్‌ను ఎనిమిదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల ప్రసాద్ వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకొన్నాడన్న కారణంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. కాగా ఈనెల 19న భార్య బాల అనుమానాస్పదస్థితిలో మృతిచెందగా భర్త ప్రసాద్ గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టాడు. దీంతో అనుమానం వచ్చిన మృతురాలి తల్లి లక్ష్మి తన కుమార్తెను ప్రసాద్ హత్యచేశాడని కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ కేసు నమోదు చేశారు. దీంతో కొత్తపల్లి తహసీల్దార్ జి.చిన్నారావు నేతృత్వంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రి ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో డాకర్ సతీష్, నలుగురు పీజీలతో వివాహిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

మావ, అల్లుడి మధ్య కూర విషయంలో గొడవ



మృతి చెందిన రాజు

» మధ్యలో తలదూర్చిన వ్యక్తి తలపై కొట్టి హత్య చేసిన అల్లుడు

ఎటపాక, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కూర విషయంలో మావ, అల్లుడి మధ్య తలెత్తిన గొడవలో తలదూర్చి, ప్రాణాలు పోగొట్టుకున్నాడో వ్యక్తి.. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన ఎటపాక మండలం చోడవరం పంచాయతీలోని ఎర్రకుంట కాలనీకి చెందిన తుమ్మల సునీల్, పొడియం చిన చెంచయ్య మావ అల్లుడు. మంగళవారం రాత్రి వీరిద్దరి మధ్య కూర విషయంలో వివాదం జరిగింది. దీంతో ఆ సమయంలో అల్లుడు సునీల్ కోపంతో అతడి మావ చెంచయ్యపై కర్రతో దాడిచేశాడు. ఈ సమయంలో చెంచయ్యకు సన్నిహితుడైన రాజు అనే వ్యక్తి ఎందుకు కొడుతున్నావంటూ సునీల్‌ను కొట్టే ప్రయత్నం చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన సునీల్ తన చేతిలోని కర్రతో రాజును తల వెనుక భాగంలో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఘటన అనంతరం నిందితుడు సునీల్ అక్కడినుంచి పరారయ్యాడు. కాగా మృతుడు రాజు 20ఏళ్ల క్రితం విశాఖపట్నం నుంచి ఈ గ్రామానికి వచ్చి ఇంటింటా పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎటపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హార్న్ కొట్టాడని వ్యక్తిపై ముగ్గురి దాడి

స్కూటీని ట్రాక్టర్‌తో తొక్కించిన వైనం

ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు

అమలాపురం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్కూటీపై వస్తూ హార్న్ కొట్టాడన్న నెపంతో స్థానిక యువకులు ముగ్గురు ఓ వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి స్కూటీని ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం రూరల్ మండల సవరప్పాలెం గ్రామానికి చెందిన కమ్మసత్తి దుర్గాప్రసాద్ మంగళవారం అర్ధరాత్రి సమయంలో స్కూటీపై బండారులంక వైపు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈదరపల్లి సమీపానికి వచ్చేసరికి ముగ్గురు యువకులు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో హార్న్ కొట్టాడు. తాము లోకల్ అని హార్న్ కొడతావా అంటూ దుర్గాప్రసాద్‌తో వాగ్వివాదానికి దిగారు. ఈదరపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు పరమట ఆనందరావు, సురేష్‌లతోపాటు నారాయణపేటకు చెందిన బర్లి వీరవెంకటసత్యనారాయణ ఒక్కసారిగా అతడిపై దాడికి దిగారు. ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమై అక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడితో ఆగకుండా స్కూటీపై నుంచి ట్రాక్టర్‌ను పోనివ్వడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఆనందరావు, సురేష్, సత్యనారాయణలపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు సీఐ వీరబాబు తెలిపారు.

రూ.3.60లక్షల విలువైన ఎండుగడ్డి దగ్ధం



పూర్తిగా దగ్ధమైన తర్వాత మిగిలిన బూడిద కుప్ప

కరప, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కరప శివారు పేపకాయలపాలెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రూ.3.60 లక్షల విలువైన ఎండుగడ్డి దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన సలాది శ్రీనుబాబు ఎండుగడ్డి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఖరీఫ్ పంటకు సంబంధించిన 75ఎకరాల ఎండుగడ్డిని కట్టలుగా కట్టి స్థానిక సాయిబాబా గుడి వద్ద ఉన్న ఖాళీప్రదేశంలో భారీ మేటును ఏర్పాటు చేశాడు. కాకినాడ, పరిసర ప్రాంతాల్లో ఒక్కో కట్ట రూ.120 చొప్పున పాడిరైతులకు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా, మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటిన తరువాత కట్టలుగా పేర్చిన ఎండుగడ్డి మేటు ఒక్కసారిగా అంటుకుంది. క్షణాల్లో మేటంతా మంటలు వ్యాపించి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న కొంతమంది వ్యక్తులు స్థానికులకు, కాకినాడ జగన్నాథపురంలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. కానీ, ఫైరింజన్ వచ్చేసరికి ఎండుగడ్డి పూర్తిగా తగులబడిపోయింది. ఫైర్‌సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమించి మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా ఆర్పివేశారు. కాగా ఈ ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనసేన నేత బోగిరెడ్డి గంగాధర్ ఘటనాస్థలికి చేరుకుని అధికారులకు సమాచారం అందించారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పథకాలపై ఎంవోటీలకు శిక్షణ తరగతులు

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహణ

ముగిసిన రెండో బ్యాచ్ ట్రైనింగ్



శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు మాస్టర్ ట్రైనీలకు ఈటీసీ అవరణలో అందిస్తున్న రెండురోజుల శిక్షణ తరగతులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం అయ్యేందుకు మరింత కృషి చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ జె. వేణుగోపాల్ అన్నారు. సామర్లకోట ఈటీసీ ఆవరణలో పీసా చట్టంపై పలు శాఖల అధికారులకు ఎంవోటీలుగా అందిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతుల రెండో బ్యాచ్ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐదు జిల్లాలకు సంబంధించి ఆయా మండలాల అధికారులు 100మంది హాజరయ్యారు. గిరిజనుల అటవీ హక్కుల బాధ్యతలు, హక్కులు, పీసా-1996 చట్టంపై అవగాహన కల్పించారు. రెండు రోజుల శిక్షణ తరగతులకు హాజరైన 36 మండలాలకు చెందిన ఎంవోటీలకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అందజేశారు. ఈ శిక్షణ తరగతుల్లో జాయింట్ డైరక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామనాథం, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఎం.చక్రపాణిరావు, నీహారిక, జగదీష్, వి.ప్రసాద్, వి. ఆంజనేయులు, పద్మజ,మొహిద్దీన్ పాల్గొన్నారు. పీసా చట్టంపై గురువారం నుంచి ఫిబ్రవరి 8 వరకూ అన్ని మండలాల పంచాయతీరాజ్ సిబ్బందికి రెండురోజుల శిక్షణ తరగతుల బ్యాచ్‌లు విడతల వారీగా జరుగుతాయని, 16రోజుల్లో ముగిస్తామని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సామర్లకోట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులో బుధవారం రాత్రి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న 30ఏళ్ల వయస్సుగల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. స్థానిక బీఎస్ఆర్ గోదాములవద్ద రోడ్డుపై అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తన సిబ్బందితో సంఘటనాస్థలికి చేరుకుని ప్రైవేట్ అంబులెన్స్‌లో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స ప్రారంభించేలోగా తీవ్రరక్తస్రావంతో మృతిచెందాడు. మృతుడు స్థానిక రిలయన్స్ సంస్థలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీనివాసరావుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించి అతడి బంధువులకు సమాచారం అందించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన కేసు

ఉపాధ్యాయుడికి రెండున్నరేళ్ల జైలు

ఉండ్రాజవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఉండ్రాజవరం జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డి.గోపాలకృష్ణమూర్తికి ఏలూరు పోక్సో కోర్టు రెండున్నరేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్టు ఎస్ఐ జి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. గోపాలకృష్ణమూర్తి 2020, ఫిబ్రవరి28న పాఠశాలలో ఓ విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్ఐ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసునమోదు చేశారు. కోర్టులో వాదోపవాదనల తర్వాత పోక్సో కోర్టు న్యాయమూర్తి ఈనెల 21న జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసులో పీపీ రామాంజేయులు వాదనలు వినిపించారు.

చేనేత జౌళిశాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద రాష్ట్రానికి ముంజూరైన స్మాల్ క్లస్టర్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాంలో పలు పోస్టులను తాత్కాలిక పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చేనేత జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి ఒక ప్రకటనలో కోరారు. క్లస్టర్ డెవలెప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులు 5, టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులు ఐదింటిని తాత్కాలిక పద్ధతిన నియమిస్తామన్నారు. అభ్యర్థులు ప్రకటన వెలువడిన 21రోజుల్లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తులను చేనేత జౌళిశాఖ కమిషనర్, 4వ అంతస్తు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లాకు అందించాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 08645-232466ను సంప్రదించాలన్నారు.

మెండి కమలకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం



మెండి కమలను సత్కరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, శ్రీశ్రీకళావేదిక వరల్డ్ రైటర్స్ ఫారం, వరల్డ్ పొయట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ముమ్మిడివరానికి చెందిన డ్వాక్రా సాధికార రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమలకు అవార్డు అందించారు. తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అంతర్జాతీయ సాహిత్య సేవాసంస్థ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మంగళవారం రాత్రి విజయవాడలోని శ్రీకౌత పూర్ణానంద విలాస్ కళావేదికలో అందించి దుశ్శాలువాతో సత్కరించారు.

రూ.15లక్షల విలువైన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ

కరప మండలం గొర్రిపూడి ఎత్తిపోతల పథకం వద్ద ఘటన

తుప్పల్లో విడిభాగాలు పడేసిన వైనం.. రాగి కోసమే చోరీ చేసినట్టు అనుమానం



రాగిని దొంగిలించగా ఘటనాస్థలి వద్ద మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్ విడిభాగాలు

కరప, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కరప మండలం గొర్రిపూడిలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా గొర్రిపూడి, గురజనాపల్లి, జి.వేమవరం, చొల్లంగి, చొల్లంగిపేట గ్రామాల్లోని 4,800 ఎకరాలకు సాగునీరందుతోంది. కాలువల్లోని నీటి లెవిల్ పడిపోతుండడంతో సాగునీటి ఎద్దడి నివారించడానికి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావించారు. ఈ క్రమంలో గొర్రిపూడి నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు(తాతాజీ), కూటమి నాయకులు గండి వెంకటేశ్వరరావు, అనుకుల రాంబాబు, యనమదల దొరబాబు, అంకన విష్ణు బుధవారం ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్లారు. అక్కడ రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు అపహరణకు గురైనట్టు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ సమీపంలోని తుప్పల్లో ట్రాన్స్‌ఫార్మర్ విడిభాగాలు కనిపించడంతో దొంగలు వాటిలోని రాగిని దొంగిలించినట్టు నిర్ధారణకు వచ్చారు. ఈ ఘటనపై కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పంతం నానాజీని కలిసి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. చోరీకి గురైన రెండు ట్రాన్స్‌ఫార్మర్ల విలువ రూ.15లక్షలు ఉండవచ్చని భావిస్తున్నారు. లక్షలు విలువచేసే ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లిపోయినా లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టనట్టు వ్యవహరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి బ్రాహ్మణ క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందజేస్తున్న కిమ్స్ డీన్ ఆనంద్‌ఆచార్య

అమలాపురం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో వైజాగ్ ఆచారి-వైజాగ్ నృసింహ జట్లు తలపడగా నృసింహ జట్టు విజయం సాధించింది. వాడపల్లి మహర్షి-కొవ్వూరి గాయత్రీ లయన్స్ మధ్య జరిగిన పోటీల్లో గాయత్రీలయన్స్ జట్టు విజయం సాధించింది. అంబాజీపేట-నందిగామ జట్ల మధ్య పోరులో అంబాజీపేట విజయం సాధించింది. అంబాజీపేట జట్టు క్రీడాకారుడు ఉపద్రష్ట నాని వంద పరుగులు సాధించారు. ఏపీ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్రాంచి మేనేజర్ ఆకెళ్ల సూర్యభాస్కరం, కిమ్స్ డీన్ ఆనంద్‌ఆచార్యలు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఉపద్రష్ట విజయాదిత్య, గండికోట సాయి, కర్రా బాబి, మహేంద్ర, అక్షయ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం అమలుకు బీజేపీ ప్రయత్నం

భారీ ర్యాలీలో కాంగ్రెస్ నేతలు గిడుగు, డాక్టర్ పాలక్



కాంగ్రెస్ ర్యాలీలో గిడుగు రుద్రరాజు, డాక్టర్ పాలక్ వర్మ, టీకే విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ఆర్ఎస్ఎస్ భావజాలంతో కూడిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్‌వర్మ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో భారీర్యాలీ చేశారు. ఈ ర్యాలీ కంబాలచెరువు నుంచి గోకవరం బస్టాండ్ వరకు సాగింది. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రాంతాల వారీగా, మతాలవారీగా దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకున్న ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని దేశంలో అమలు చేయాలనే ప్రయత్నం బీజేపీ చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంత వరకు ఈ దేశాన్ని విచ్ఛిన్నం కానివ్వమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, ట్రైనింగ్ ఇన్‌చార్జ్ జంగా గౌతమ్, జిల్లా ఇన్‌చార్జి కొలనుకొండ శివాజీ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్.రామారావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు పుల్లారావు, డాక్టర్ వడయార్, పట్నాల శ్రీనివాస్, ఎం.శారద, కారింకి వెంకటేశ్వరరావు, సిటీ అధ్యక్షుడు మేడారపు భద్రం పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు మంత్రి లోకేశ్ పుట్టినరోజు వేడుకలు

సర్పవరం జంక్షన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా గురువారం వలసపాకలలో కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలడడక్ష్మి ఆధ్వర్యంలో, అలాగే మండలంలో పలు చోట్ల టీడీపీ నాయకులు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు.

నిధుల విడుదలకు కృషి చేస్తా

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగని విలీన గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకు కృషి చేస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు బుధవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నానాజీని కలిసి ఆర్థిక సంఘం నిధుల విడుదల కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరగని ఆరు గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో తాగునీరు, పారిశుధ్య, వీటి దీపాల నిర్వహణ తదితర సమస్యలు పరిష్కరించడంలో నిధుల సమస్య వెన్నాడుతుందని స్థానిక మాజీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇంటి పన్నులు వసూలు చేసి శానిటేషన్ సిబ్బందికి జీతాలు ఇవ్వాల్సి వస్తూందని, కనీసం ప్రాథమిక అవసరాలు తీర్చలేని దుస్థితి పంచాయతీల్లో ఉందన్నారు. కాకినాడ సిటీలో విలీనానికి స్థానికులు కొంతమంది న్యాయస్థానంలో పిటిషన్ వేయడంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించడం జరుగుతుందని హామీఇచ్చారు. ఈ ఆరు గ్రామ పంచాయతీల భవితవ్యం స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతీల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

గృహాలు లేని వారి వివరాలను నమోదు చేయాలి : పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

పిఠాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గృహాలు లేని వారిని గుర్తించేందుకు జరుగుతున్న సర్వేలో వెల్లడైన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ సూచించారు. పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీపీఆర్డీలు, ఏపీఎంలు, ఏపీవోలు, వర్క్ఇనస్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకుంటామని ముందుకు వచ్చేవారిని గుర్తించాలని చెప్పారు. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న గృహాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని తెలిపారు. అవి ఏ దశల్లో ఉన్నాయో గుర్తించి వారికి రావాల్సిన బిల్లులతో పాటు ఉపాధి నిధులు సకాలంలో అందేలా చూడాలని చెప్పారు. హౌసింగ్ ఈఈ వై.శ్రీనివాస్, పిఠాపురం డీఈఈ ఎల్.శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా ముగిసిన ఉరుస్ షరీఫ్ గంధోత్సవం



దర్గా వద్ద అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కుడా చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతపెద్దాపురం శివారు ప్రాంతంలో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా ఉరుస్ షరీఫ్ గంధోత్సవ వేడుకలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దర్గా వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. అలాగే దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ లాయక్ ఆలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వీకరించారు. ఏరియా ఆసుపత్రి మాజీ చైర్మన్ బొడ్డు బంగారుబాబు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, సీపీఎం నేత నీలపాల సూరిబాబు తదితరులున్నారు.

‘డ్రగ్స్ ఊబిలోకి వెళ్లవద్దు’

గొల్లప్రోలు/పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఊబిలోకి వెళ్లవద్దని, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం చిన్నాభిన్నమవుతుందని గొల్లప్రోలు, పిఠాపురం పట్టణ, రూరల్ ఎస్‌ఐలు ఎన్.రామకృష్ణ, మణికుమార్, గుణశేఖర్ తెలిపారు. గొల్లప్రోలులోని మాధురి జూనియర్ కళాశాల, పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని విరవ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లమని, వాటి వల్ల కలిగే నష్టాలు గురించి అందరికి తెలియజేస్తామని విద్యార్థులతో పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు.

పాడి పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వ చర్యలు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న జేడీ

కొత్తపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల ఆరోగ్యానికి మెరుగైన చికిత్స అందించడం ద్వారా ఉత్పాదక పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సూర్యప్రకాశరావు అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి కొత్తపల్లి, నాగులాపల్లిలో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈనెల 31వరకు నిర్వహించే ప్రత్యేక శిబిరాల ద్వారా పాడిపశువుల ఆరోగ్యానికి చికిత్సలు, ఉత్పాదకతను పెంచే చర్యలతో పాటు వ్యాధులను నియంత్రించేందుకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎదకు రాని, చూడు కట్టని, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందజేస్తారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. కొత్తపల్లి, నాగులాపల్లి పశువైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సందీప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలి

కమిషనర్ భావన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ కాకినాడ నగరపాలక కమిషనర్ భావన బుధవారం తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా నగరంలోని మూడో సర్కిల్, ఆరో వార్డులోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. చెత్తతో అధ్వానంగా ఉన్న ఆ ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసే పనులను చూశారు. ప్రయివేట్ ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. 9వ డివిజన్ కన్నయ్య కాపునగర్‌లో డ్రైయిన్ ధ్వంసమై మురుగునీరు రోడ్డుపైకి వస్తుందంటూ వచ్చిన ఫిర్యాదుపైనా కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రైనేజీ పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

హోప్ ఐలాండ్‌లో జాతీయజెండా ఆవిష్కరణ



తాళ్లరేవు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ పరిధి కాకినాడ సముద్రగర్భంలో ఉన్న హోప్ ఐలాండ్‌లో రిపబ్లిక్‌డే ను పురస్కరించుకుని ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ జెండాను బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రభుత్వాధికారులు ఆవిష్కరించారు. కోరింగ ఫారెస్ట్ అధికార్లు, కోస్ట్‌గార్డులు, పంచాయతీ కార్యదర్శి విజెవి రమణ ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

గొల్లప్రోలు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో మరణించిన మహిళ తిప్పర్తి అంకాలమ్మ కుటుంబానికి మైత్రి కంపెనీ అధినేత పంపన త్రినాథరావు రూ.10వేల ఆర్థికసహాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని దుర్గాడ ఉపసర్పంచ్ సూర్యచంద్రరావు కుటుంబసభ్యులకు అందజేశారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బేతా సత్యనారాయణ, నీలం నాగేశ్వరరావు, విప్పర్తి లాజరు, విజయబాబు, సూరిబాబు తదితరులున్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ ధ్యేయం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ ధ్యేయమని కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పేర్కొన్నారు. జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఏఐసీసీ ఆధ్వర్యాన ఏడాది పాటు నిర్వహించనున్నారన్నారు. ఈ నెల 7న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రీకారం చుట్టారన్నారు. అంబేడ్కర్‌ను అవమాన పరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని డిమండ్ చేశారు. ఇంతదారుణం జరిగినా ప్రధాని ఏ విధంగా స్పందించకుండా ఉండటంతో బీజేపీ పరిపాలన ఏవిధంగా సాగుతుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, పీసీసీ కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి మారోతి శివగణేష్, బంగారు జయప్రకాష్ పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు

గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ



గొల్లప్రోలులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద పహారా కాస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గొల్లప్రోలు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలు, ఉన్నత పాఠశాలల వద్ద అకతాయి చేష్టలు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ హెచ్చరించారు. గొల్లప్రోలులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల వద్ద విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా బుధవారం ఉదయం, సాయంత్రం పహారా ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. ఎవరైనా అపరిచితులు లేదా ఈవ్‌టీజర్లు వచ్చినట్టు సమాచారం అంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు.

కొత్తపల్లిలో పోలీసుల నిఘా

కొత్తపల్లి: ఉప్పాడ నుంచి కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు బాలికలను పంపాలంటే తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేసే పరిస్థితి ఉంది. పాఠశాలలకు వెళ్లే సమయంలో, సాయంత్రం విడిచిపెట్టే సమయంలో ఆకతాయిలు బైక్‌లపై దూసుకుపోవడంతో బాలికలు హడలెత్తిపోతున్నారు. బైక్‌ల వెనుక కూర్చున వ్యక్తులు బాలికల చున్నీలను లాగడం వంటి వికృత చేష్టలు చేస్తున్నారు. దీంతో ఎస్ఐ జి.వెంకటేష్ రోజూ పాఠశాలల వద్ద సిబ్బందితో పటిష్టమైన చర్యలు చేపట్టారు.

నాగుకు ఉత్తమ సహాయ నటుడు అవార్డు



నాటక పరిషత్ పోటీల్లో నటించిన నాగు

పెద్దాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అనంతవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్టీఆర్ నాటక పరిషత్ పోటీల్లో మండల పరిధిలోని తాటిపర్తికి చెందిన ప్రజానాట్యమండలి కళాకారుడు కేదారి నాగు ఉత్తమ సహాయ నటుడు అవార్డును అందుకున్నారు. సాయి ఆర్ట్స్ నాటక సమాజంలో పీటీ మాధవ్ రచనలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో ప్రదర్శించిన జనరల్ బోగీలు నాటికలో నటనకు ఉత్తమ సహాయ నటుడు అవార్డు దక్కింది. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, రొంగల వీర్రాజు, డి.కృష్ణ, సత్యనారాయణ, రాంబాబు అభినందించారు.

సోషల్ ఆడిట్ బృందం తనిఖీ

సామర్లకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట అయోధ్యరామపురం పీఎంశ్రీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్ తనిఖీ అధికారి కె.హరి బృందం రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత, మరుగుదొడ్ల పరిశుభ్రత, వివిధ రిజిస్టర్ల నిర్వహణ, తరగతి గది నిర్వహణ, క్రీడాపరికరాలు, పాఠశాల మైదానం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులున్నారు.

రైతులకు అదనపు నష్టపరిహారం ఇప్పించాలి

కాకినాడ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సెజ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున అదనపు నష్టపరిహారం ఇప్పించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ సమన్వయకర్త తోటి చెంగల్‌రావు పేర్కొన్నారు. కొత్తపల్లి మండల సెజ్ రైతుల జేఏసీ ఆధ్వర్యంలో రైతులతో సెజ్ రైతులతో కలిసి ఆయన బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సెజ్‌లో అభివృద్ధి పరచిన భూముల్లో ఎకరాకు 5 సెంట్లు చొప్పున రైతులకు తిరిగి ఇవ్వాలని, ప్రతి కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని, సెజ్ భూముల్లో కాలుష్య రహిత పరిశ్రమలను మాత్రమే స్థాపించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం చెంగల్‌రావు మీడియాతో మాట్లాడుతూ భూసేకరణ జరిపిన తీరుపైన, ఎస్ఈజెడ్ చట్టాల ఉల్లంఘనపైన సమగ్రమైన దర్యాప్తు జరిపించాలన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రైతులకు న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు కొర్ని వెంకటరమణ, ఓసుపల్లి ఉప్పాకు, కోదూరు బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

‘విమానాశ్రయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి’

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా జిల్లా ప్రయాణికుల సంఘం కాకినాడ పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరుతున్న నేపథ్యంలో ఇటీవల అన్నవరం ప్రాంతంలో విమానాశ్రయ ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లడంతో సంతోషించామని కానీ ఈప్రతిపాదనలకు విమానయాన అనుమతించలేదన్న విషయం నిరుత్సాహం కలిగించిందని మొదటి నుంచి ప్రతిపాదిస్తున్న గురజనాపల్లి ఉప్పు భూముల్లో విమానాశ్రయ నిర్మాణానికి వెంట నే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మో హన్‌నాయుడికి, కాకినాడ ఎంపీకి ప్రయాణీకుల సంఘం విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్య క్షుడు వైడీ రామారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ నగరాన్ని ఇప్పటికే ఎన్నో దశాబ్దాలుగా ప్రధాన రైలు మార్గంలోకి తేవడానికి కృషి చేస్తున్నామని, ప్రధాన రైలు మార్గానికి అనుసంధానం చేయడంలో జరుగుతున్న జాప్యం ఇప్పుడు విమానాశ్రయ ఏర్పాటుకు కూడా అడ్డంకులు ఏర్పడినట్లయితే కాకినాడకు పరిశ్రమలు, పెట్టుబడలు ఎలా వస్తాయన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని కోరారు.

పేదలకు వస్త్రదానం

తాళ్లరేవు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం పురోహితులు దివంగత కృష్ణమూర్తి భార్య సూర్యాకాంతం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పేదలకు బుధవారం వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. 50మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ కుటుంబాన్ని అభినందించారు. ధూళిపూడి సుబ్బారావు, రాయుడు సింహాచలం, వెంటపల్లి నాగభూషణం, ఆనాల పాపారావు, ధూళిపూడి ఈశ్వరరావు ఉన్నారు.

కరెంట్ అఫైర్స్ బుక్ ఆవిష్కరణ

కాకినాడ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన పిసి మెయిన్స్ 6 మంత్స్ కరెంట్ అఫైర్స్ బుక్‌ను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ బుధవారం ఆవిష్కరించారు. ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ శ్యామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావ్, ఎస్‌బి డిఎస్పీ సీహెచ్ శ్రీరామ కోటేశ్వరరావ్ పాల్గొన్నారు.



కరెంట్ అఫైర్స్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

గ్రీన్ క్యాంటీన్ ప్రారంభం



వీసీతో డైరెక్టర్లు, విద్యార్థులు

జేఎన్టీయూకే, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రాంగణంలోని యూసీఈకే కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన గ్రీన్ క్యాంటీన్‌ను ఇన్‌చార్జి వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ సుదూరప్రాంతాల నుంచి వచ్చేవారికి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఈ క్యాంటీన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, డైరెక్టర్లు వి.రవీంద్ర, బి.బాలకృష్ణ, ఏసురత్నం, మాజీ వీసీ ప్రసాదరాజు, బీటీకృష్ణ పాల్గొన్నారు.

వర్సిటీలో పూల్ క్యాంపస్

వర్సిటీలోని ఐఐఐపీటీ డైరెక్టరేట్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో అలూమ్ని ఆడిటోరియంలో బుధవారం ఫార్మసీ విద్యార్థులకు విశాఖపట్నంలోని సినర్జీన్ కంపెనీ పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణను ఆయన ఛాంబర్‌లో కలువగా విద్యార్థులు తమ డిగ్రీపట్టాను అందుకున్న వెంటనే తగిన ఉద్యోగం పొందేలా శిక్షణ నిస్తున్నామని తెలిపారు. ఐఐఐపీటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ ప్రొఫెసర్ కె.పద్మప్రియ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల నుంచి సుమారు 200మంది విద్యార్థులు హాజరుకాగా 60మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ కంపెనీ మేనేజర్లు రవిశర్మ, రవితేజ ఉన్నారు.

చంద్రబాబు, పవన్ నేతృత్వంలో పదేళ్ల పాలన

ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ నేతృత్వంలో పదేళ్లు తెలుగుదేశం పాలన కొనసాగుతుందని ఇందులో ఎటువంటి అపోహలకు తావులేదని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేశారు. బుధవారం సామర్లకోట మండలం అచ్చంపేటలోని తన స్వగృహంలో విలేకరులతో రాజప్ప మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వాన్ని విడగొట్టేందుకు కొన్ని దుష్టశక్తులు కుయుక్తులు చేస్తున్నారన్న విషయాన్ని కార్యకర్తలు గమనించాలని చెప్పారు. టీడీపీ శ్రేణులందరూ ఇటువంటి అవాస్తవ విషయాలను పట్టించుకోకుండా ప్రభుత్వపాలన, సంక్షేమంపైనే అందరూ దృష్టిసారించాలని సూచించారు. ఎవరు ఏమి మాట్లాడినా టీడీపీ శ్రేణులందరూ సంయమనంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే హితవు పలికారు.

మహిళపై దాడి కేసులో అడ్వకేట్‌కు రెండేళ్ల జైలు

కాకినాడ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఆమెపై దాడికి పాల్పడిన కేసులో ఓ అడ్వకేట్‌పై నేరం ఋజువు కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు అతడి కుటుంబ సభ్యులకు జరిమానా విధిస్తూ కాకినాడ 2 వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్న లక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ, రామకృష్ణారావు పేట, గౌరుసువారి వీధికి చెందిన అడ్వకేట్ గౌరుసు రాజకీర్తి, అతడి తండ్రి నూకరాజు, అతడి సోదరి శబరి కలిసి 2016లో వారి ఇంటి సరిహద్దులో నివసిస్తున్న నంబట్ల సత్యవతితో ఇంటి సరిహద్దు విషయంలో గొడవ పడి రాజకీర్తి కుటుంబం ఆమెను రాళ్లతోను, కర్రతోను కొట్టి గాయపర్చడమే కాకుండా రాజకీర్తి ఆమెపై అసభ్యంగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు సత్యవతి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు నిందితుడిని, అతడి కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం జరిగిన వాదోపవాదనల్లో నిందితుడు, అతడి కుటుంబ సభ్యులపై నేరం ఋజువు కావడంతో రాజకీర్తిపై ఐపీసీ సెక్షన్ 354 ప్రకారం అసభ్యకరంగా ప్రవర్తించినందుకు రెండేళ్ల జైలు, ఐపీసీ సెక్షన్ 324 ప్రకారం గాయపర్చినందుకు 6 నెలల జైలు, మరో సెక్షన్ ప్రకారం రూ.1000 జరిమానా విధించారు. అలాగే నూకరాజు, శబరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ గోసాల కమలకుమారి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు.

పశువైద్య శిబిరం

కరప, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య వైద్యశిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రవికిరణ్ సూచించారు. పెనుగుదురులో బుధవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి పలు పశువులకు జలగ నివారణ మందు అందజేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీచేశారు. పశువుల్లోని గర్భకోశ వ్యాధులకు చికిత్సచేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, గ్రామకమిటీ అధ్యక్షుడు గంటా నానిబాబు, కార్యదర్శి ఎం.చంద్రకళ, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



2న ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశాలు

పిఠాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా శాఖ తృతీయ కౌన్సిల్ సమావేశాలు ఫిబ్రవరి 2న జరగనున్నాయి. సమావేశాల పోస్టర్లను పిఠాపురంలో బుధవారం నియోజకవర్గ సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. కాకినాడలోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఈ సమావేశాలకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, కే.రమేష్‌కుమార్ హాజరుకానున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గం, జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. సంఘం నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్, రాధాకృష్ణ, ప్రియ, సత్యవతి, కల్పన, మధుసూదనరావు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

అలరించిన సంగీత కచేరి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో సంక్రాంతి గానసభల పది రోజుల కార్యక్రమాల్లో నాల్గోరోజు బుధవారం వివేక్ సదాశివం, చెన్నై వారి గాత్ర కచేరి అలరించింది. అన్నమాచార్యుల వారి కన్నడగౌడ రాగంలో కరుణానిధిం, త్యాగరాజస్వామి వారి కాంబోజి రాగంలో మా జానకి, ఖరహరప్రియ రాగంలో చక్కని రాజమార్గమే ఉండగా తదితర కీర్తనలు గానం చేసి మైమరపించారు. వారికి వయోలిన్‌పై చిన్నయి చెన్నై, మృదంగంపై మహాదాసు ఏడుకొండలు విజయనగరం చక్కటి సహకారాన్ని అందించారు. శ్రీ బాలాంత్రపు మల్లిఖార్జునరావు జ్యోతి ప్రజ్వలన చేశారు.

వైసీపీ పట్టణాధ్యక్షుడిగా రావుల

పిఠాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ పిఠాపురం పట్టణ అధ్యక్షుడిగా రావుల మాధవరావు నియమితులయ్యారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాధవరావును పలువురు నాయకులు అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 29 మందికి కాకినాడ 3వ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహరావ్ జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు ఎస్ రమేష్, డి.రామారావ్ తమ సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 29 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 11మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే మరో 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

పోలవరం గ్రామసభ వాయిదా

కూనవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కూనవరంలో గురువారం జరగాల్సిన పోలవరం గ్రామసభ వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల ఈ గ్రామసభ వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, సర్పంచ్ రాజామణి

పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

దేవీపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయంవద్ద బుధవారం తాళ్ళూరు గ్రామ పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇటీవలే పోలవరం నిర్వాసితుల కుటుంబాలకు సుమారు 815 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం నిర్వాసితులకు మంచి రోజులు వచ్చాయన్నారు. అనంతరం తాళ్ళూరు గ్రామానికి చెందిన 107మందికి ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే శిరీషదేవి, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, సర్పంచ్ కుంజం రాజామణి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మఠం విజయభాస్కర్, టీడీపీ అధ్యక్షుడు మరిచెట్ల వెంకటేశ్వరరావు, బీజేపీ అధ్యక్షుడు కారం రామన్నదొర, జనసేన అధ్యక్షుడు చారపు రాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు లంక హరిశ్చంద్రుడు, మాగాపు బాబురావు, గోళ్ల చంటిబాబు, శివరామకృష్ణ, గంగాధర్, నాగేశ్వరరావు, పోసమ్మ, నాగేశ్వరి, మల్లేష్, పండు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వద్ద కన్నీరు పెట్టుకున్న నిర్వాసితులు

పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన కొంతమంది నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో అర్హులుగా గుర్తించకపోవడంతో నిర్వాసితులు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వద్ద కన్నీరు పెట్టుకున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాలచుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదని, అధికారులవద్దకు వెళితే పెళ్లిళ్లు అవ్వకపోయిన అయినట్లు అధికారులు జాబితా లో చేరుస్తున్నారని, పక్క గ్రామాలకు ఉపాధి నిమిత్తం పనులకు వెళ్లిన వారిని గ్రామాంతరం అని చిన్నచిన్న కారణాలతో తమను అనర్హులుగా గుర్తిస్తున్నారని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. గిరిజనులకు భూ నష్టపరిహారం, గ్రామాన్ని ఖాళీ చేసే సమయానికి యువతీ యువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తదితర విషయాలను ఆమె దృష్టికి తెచ్చారు.



ఎమ్మెల్యే వద్ద సమస్యలు విన్నవించుకుంటున్న నిర్వాసితులు

జాతీయస్థాయి అవార్డు గ్రహీత

రమేష్‌కు అభినందనలు



విజయవాడలో శ్రీ శ్రీ కళావేదిక నుంచి జాతీయ అవార్డు అందుకున్న నూనె రమేష్

చింతూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరరామ చంద్రపురం మండలం, రేఖపల్లికి చెందిన నూనె రమేష్ సాహిత్య రంగంలో జాతీయస్థాయి అవార్డు అందు కున్నారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవంలో నూనె రమేష్‌కు గౌరవం దక్కింది. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫో రం, వరల్డ్ పొయట్రీ అకాడమీలు సంయుక్తంగా సాహిత్య సామాజిక రంగాలలో విశేష సేవలందిస్తున్న వారికి అవార్డు ప్రధానం చేసింది. కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు హాజరయ్యారు. వారిలో సాహిత్య రంగంలో సేవలందిస్తున్న నూనె రమేష్‌ను ఎంపిక చేసి జాతీయస్థాయిలో జాతీయ యువతేజం అవార్డు అందించి గౌరవించారు. రమేష్ చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రమేష్‌ను బుధవారం పలువురు అభినందించారు.

ఎంపీటీసీ నాగేశ్వరరావుకు పలువురి పరామర్శ



వేగి రమణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మోతుగూడెం, జనవరి22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం స్థానిక టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు తల్లి వేగి రమణమ్మ మృతి చెందడంతో ఎంపీటీసీని నాలుగు మండలాల టీడీపీ నాయకులు, ఉద్యోగులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో కూనవరం టీడీపీ నాయకులు ఎడవెల్లి భాస్కర్, ఉమా అప్పారావు, వీఆర్ పురం ముత్యాల రామారావు, చింతూరు మండల ప్రెసిడెంట్ చెన్నారెడ్డి, ఆసిఫ్ జాంగిర్, రామారావుచౌదరి, జీకే టెస్ట్ అధినేత, టీడీపీ నాయకులు జమాల్ ఖాన్ సాల్మన్‌రాజ్, చింతూరు వైసీపీ నాయకులు రామలింగారెడ్డి, సుధాకర్, కోట్ల కృష్ణ మురళి, చింతూరు, కూనవరం బీజేపీ నాయకులు పాయం వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, డొంకరాయి టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ, గుర్రప్ప టీడీపీ నాయకులు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, ఎస్ఐ శివనారాయణలు ముందుగా వేగి రమణమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

అడ్డతీగలలో శిశు ఆధార్ నమోదు కార్యక్రమం

అడ్డతీగల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం సీడీపీవో వైసుధ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి ఆదేశాల మేరకు అడ్డతీగల పోస్టల్‌శాఖ బ్రాంచ్ మేనేజరు రాజ్‌కుమార్ సమన్వయంతో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి 75మంది శిశువులకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశామని వైసుధ తెలిపారు. కార్యక్రమంలో తమ కార్యాలయ సిబ్బంది పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం అందజేత

అడ్డతీగల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అడ్డతీ గలలో సోమవారం అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన పుడిగి మాణిక్యం కుటుంబ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరిషా దేవి దంపతులు పదివేల రూపాయల ఆర్థిక సహాయం బియ్యం నిత్యావసర సరుకులను బాధిత కుటుంబానికి అందించారు. అనంతరం ప్రభుత్వంనుంచి అందాల్సిన సహాయాన్ని సహయాన్ని త్వరిత గతిన వచ్చేలా అధికారులకు ఆదేశిస్తామన్నారు. స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

తుని రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో ప్రధాన కూడలైన గొల్ల అప్పారావు సెంటర్‌నుంచి అన్నవరం వైపునకు రాకపోకలు జరిపే వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. నిబంధనలు తుంగలోకి తొక్కి ఆ మార్గంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమించడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. హోటళ్ల వద్ద పార్కింగ్ సదుపాయం లేక వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేయడం ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతుందని పట్టణ వాసులు వాపోతున్నారు.



ద్విచక్రవాహనాలు అడ్డుగా ఉండడంతో రాకపోకలకు వీలు లేక నిలిచిపోయిన వాహనాలు

గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీకి వినతి



ఎంపీకి జ్ఞాపికను అందిస్తున్న నాగేశ్వరరావు

శంఖవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కొంతంగి కొత్తూరు గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయభాస్కర్‌ను డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు కోరారు. గ్రామపెద్దలతో బుధవారం ఆయనను కలిసి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కూటమి పాలలో రాష్ట్రం ఎంతగానో అబివృద్ధి చెందుతోందని, కొన్ని పనుల నిమిత్తం ఆయనకు ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. వాటిపై సానుకూలంగా స్పందించారన్నారు.

బెనబాబుకు ఏపీజే అబ్దుల్ కలాం నేషన్ స్టార్ అవార్డు

అన్నవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా మూడు దశాబ్దాలుగా సేవలందిస్తూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న డాక్టర్ బెనబాబు పశ్చిమబెంగాల్‌కు చెందిన వెల్ రెడ్ ఫౌండేషన్ ద్వారా ఏపీజే అబ్దుల్ కలాం నేషన్ స్టార్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును ఆయన మాజీమంత్రి యనమల రామకృష్ణుడు నుంచి బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు, పలువురు నాయకులు అభినందించారు.



యనమల నుంచి అవార్డు అందుకుంటున్న బెనబాబు

'మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి'

తుని రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తుని పట్టణ ఎస్ఐ విజయ్‌బాబు కోరారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు రాజా కళాశాల గ్రౌండ్లో యువతకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయ్‌బాబు

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన సదస్సు

ఏలేశ్వరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనాపల్లిలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ బుద్ద సూర్యప్రకాష్ నేతృత్వంలో బుధవారం ఏర్పాటు చేసిన బాలల సభకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలల్లో పదోతరగతి ప్రథమస్థానంలో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరును ఆయన అభినందించారు. టీడీపీ నాయకులు సుంకర సత్తిబాబు, అప్పికొండ దుర్గ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా: ముద్రగడ

ప్రత్తిపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తనవంతు సహకారం అందించి అందుబాటులో ఉంటామని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ తన తనయుడు ముద్రగడ గిరిబాబును ఆశీర్వదించాలని కోరారు. ధర్మవరంలో బెంతుకుర్తి సుశీల అబ్బాయి, ఎంపీటీసీ జువ్వల సుజాత బాబులు స్వాగతం పలికారు. ధర్మవరం, రాచపల్లిల్లో పలువురిని పలకరించారు. జలిగంపల ప్రభాకరరావు, బంకు శ్రీను, రాచపల్లి సర్పంచ్ లోవలక్ష్మి గంగరాజు, రాపేటి పెద్ద ఉన్నారు.

'నిరక్షరాస్యత నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వయోజన విద్య జిల్లా కోఆర్డినేటర్ వెంకటరెడ్డి

ప్రత్తిపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ వెంకటరెడ్డి కోరారు. వెలుగు కార్యాలయంలో బుధవారం వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ శిక్షణా శిబిరాన్ని మండలాధ్యక్షుడు గోళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, మండలంలోని 65 సెంటర్ల ద్వారా 55రోజుల్లో వారిని అక్షరాస్యులను చేయడంకోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హెచ్‌డీ యాంకర్ అనిల్‌కుమార్, ఏపీఎం వెంకట్, వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

'బీజేపీలో పనిచేసేవారికి సముచిత గుర్తింపు'

ప్రత్తిపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీలో అంకితభావంతో పని చేసే వారికి సముచిత రీతిలో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తెలిపారు. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన కర్రి ధర్మరాజు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా పెదశంకర్లపూడిలో పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యుడు ధర్మరాజును శాలువా కప్పి సన్మానించి అభినందించారు. బీజేపీ మండల నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, నానిపల్లి శ్రీనివాస్, గొనగాల గోపి పాల్గొన్నారు.

వేమన పద్యాలపై ప్రచారం

గండేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన నిగూఢ తత్వార్థ బోధిని అనే గ్రంథంలో 110 వేమన పద్యాలను రాజమండ్రి ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం గండేపల్లి, ఎన్టీరాజాపురం, గోపాలపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు సత్యవతి, దేవి, శాంతి, శోభారాణి పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధికే పెద్దపీట'

శంఖవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికే కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, పల్లెల్లో మౌలిక సదుపాయాలు, రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం వంటివి గుర్తుంచడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని టీడీపీ నాయకుడు తోట అప్పారావు అన్నారు. మండలంలోని గవిరంపేటలో బుధవారం పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీలో నూతన పదవులు

ఏలేశ్వరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీలో కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నీలి సురేష్ అన్నారు. మండలంలోని లింగంపర్తి గ్రామానికి చెందిన కరెడ్ల ఏసుబాబును మండల ప్రధాన కార్యదర్శిగా, గరికి నాగును మండల యువ మోర్చా అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కూరాకుల రాజా, పలివెల మల్లేశ్వరరావు, గూడు సత్తిబాబు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఆన్‌లైన్ లెక్చర్ సిరీస్ ప్రారంభం

గండేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ(సెంటర్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్), సివిల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ ఇంజనీరింగ్‌లో ఆవిష్కరణాత్మక పరిశోధన అనే ఆన్‌లైన్ లెక్చర్ సిరీస్ ప్రారంభమైంది. దీన్ని డాక్టర్ బి.రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించి సస్టైనబుల్ కాంక్రీట్ పదార్థాలు, ఫైబర్ రీఇన్‌ఫోర్స్డ్ కాంక్రీట్ వంటి ఆధునిక పరిశోధన అంశాలపై వివరించారు.

'ఆదిత్య'లో ఐదు రోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిత్య యూనివర్సిటీ ఫ్రెష్‌మ్యాన్ ఇంజనీరింగ్ విభాగంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ వారి సౌజన్యంతో ఫౌండేషన్ ఆఫ్ టీచరింగ్ అండ్ లెర్నింగ్ అనే అంశంపై ఐదురోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైనట్లు ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

'వృత్తి నైపుణ్యాలు మెరుగుకు అవగాహన పెంపొందించుకోవాలి'

గండేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక శాస్త్ర విజ్ఞానానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడనికి అవగాహన పెంచుకోవాలని ఆదిత్య విశ్వవిద్యాలయ సహాయ ఉపసంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి కోరారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో హైదరాబాద్‌కు చెందిన ఆర్టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో ఎంబెడెడ్ సిస్టంపై నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేర్చుకున్న అంశాలను అనుభవంలోకి మలుచుకున్నప్పుడే దీనికి సార్థకత చేకూరుతుందన్నారు.

కోర్టు కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు

తునిరూరల్,జనవరి 22(ఆంధ్రజ్యోతి): తుని కోర్టుకు కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తుని బార్ అసోసియేషన్‌కు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులుయనమల రామకృష్ణుడు హామీఇచ్చారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు యనమల సతీష్, సాకా సత్తిబాబు, బోనం చినబాబు, వై.బద్రి నారాయణమూర్తి, ఎన్.మూర్తి, యనమల సత్యనారాయణ, బర్ల రవికుమార్, యాదవుల లోవకృష్ణ పాల్గొన్నారు.



యనమలను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద రహదారి భద్రతా మాసోత్సవాలు

కిర్లంపూడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ వా ఎస్‌హెచ్ సేఫ్‌వే, టీబీఆర్ ఇన్‌ఫ్రా, ఎస్‌కే షాన్‌భాషా ఆధ్వర్యంలో బుధవారం కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, సేఫ్‌వే ప్రాజెక్టు ఇన్‌చార్జి నాగేశ్వరరావు, సీనియర్ సేఫ్టీ మేనేజర్ అశోక్, టోల్‌ప్లాజా మేనేజర్ జీవీ రమణ, టోల్ మేనేజర్ సురేష్‌కుమార్, ఆశిస్ సేఫ్టీ అండ్ రెడ్‌క్రాస్ ప్రతినిధి డాక్టర్ పి.దుర్గరాజు, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో టోల్‌ప్లాజా సిబ్బంది, రోడ్డు వినియోగదారులు కలిసి కాకినాడ రెడ్‌క్రాస్ సొసైటీ వారికి 43 యూనిట్లు రక్తాన్ని దానం చేశారు.



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

వాక్‌థాన్ ర్యాలీ

జగ్గంపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని జగ్గంపేటలో వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది వాకథాన్ జగ్గంపేట బస్టాండ్, ఏలేశ్వరం రోడ్డు, నేషనల్ హైవే ఎన్‌హెచ్16, జేవీఆర్ సెంటర్‌లో ఈ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

తుని రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన శిశు జననానికి పౌష్టికాహారం కీలకమని సీడీపీవో నిహారిక తెలిపారు. తుని పట్టణంలో కొత్తపేట అంగన్‌వాడీ సెంటర్లో సామూహిక సీమంతాలకార్యక్రమంలో గర్భిణులకు పౌష్టికాహారాన్నిఅందజేశారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా ప్రసాద్



తుని రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా తునికి చెందిన బీడీ ప్రసాద్ నియమితులయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రమాణస్వీకారంలో జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా బీడీ వి.ప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా ఎం.ప్రభావతి ప్రమాణ స్వీకారం చేశారు. తుని వాకర్స్ హెల్త్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, చదరం శివాజీ, కుందెం సత్యనారాయణ, వాడపల్లి శ్రీనివాస్, జూరెడ్డి చిరంజీవి, మల్లిపెద్ది విశ్వేశ్వరరావు, టి.మల్లేశ్వరరావు ప్రసాద్‌ను అభినందించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ పరామర్శ

కిర్లంపూడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. రమణయ్యపేటలో దొడ్డి రమణ, ముత్తా పెద్దకాపు, గౌతు వారి వీధిలో ఉపసర్పంచ్ గౌతు జగన్నాధరావు, గౌతు చిన్న, పోతుల శివాజీ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, శ్రీరామ్మూర్తి, ఆళ్ల బాబులు, తూము పెద్ద కల్యాణ్ ఉన్నారు.

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING

DAKU MAHARAAJ : 11-20AM, 2-15PM, 6-45PM,9-40PM
PUSHPA THE RULE PART 2 (T) : 10-00AM, 2-05PM, 6-10PM,10-15PM
GAME CHANGER : 11-15AM, 2-20PM, 6-15PM, 09-45PM
SANKRANTHIKI VASTHUNAM 11-45AM, 2-30PM, 5-00PM, 7-25PM 10-15PM
DAKU MAHARAAJ : 11-30AM, 2-30PM, 6-15PM, 9-15PM
SANKRANTHIKI VASTHUNAM 11-45AM, 12-30PM, 2-45PM, 3-15PM, 6-30PM, 7-10PM, 9-45PM, 10-00PM
GAME CHANGER : 11-15AM, 2-20 PM, 6-20PM, 9-45PM